క్లుప్తంగా

స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని నాచువారి సెంటర్లో ఉన్న రాధాకృష్ణ మందిరం వద్ద బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. శ్రీరామనవమి వేడుకలను వాడవాడలా ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించి స్వామివారి కల్యాణ నిర్వహించడం శుభపరిణామమన్నారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని శ్రీనివాస్ ఆకాంక్షించారు. సీతారాములకు ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వహకులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రో కెమికల్స్ పరికరం ఆవిష్కరణ


ఎలక్ట్రో కెమికల్ పరికరాన్ని ఆవిష్కరించిన దృశ్యం

భీమవరం: ఆక్వారంగంలో మొబైల్ అప్లికేషన్, ఎలక్ట్రానిక్ అండ్ ఎలక్ట్రో కెమికల్స్ పరికరం విప్లవాత్మక మార్పులకు దోహదం చేస్తుందని యూనోఫీడ్స్ అధినేత తటవర్తి నవీన్ అన్నారు. భీమవరంలో ఆక్వా రైతులకు ఉపయోగపడే ఎలక్ట్రో కెమికల్స్ పరికరం ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆక్వా రైతుల కోసం సలాది గోపీకృష్ణ, పప్పు శ్రీరామ్ కృషితో కౌంట్ 366 సంస్థను స్థాపించి రైతులకు ఉపయుక్తమైన అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ డివైస్‌లను రైతులకు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో యిర్రింకి సూర్యారావు, వెంకట్, అమరనేని శ్రీనివాస్, కడలి వెంకటరమణ, బొమ్మిడి సునీల్ కిరణ్‌కుమార్ వీరేంద్ర, కొమ్ముల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమాఖ్య నూతన కార్యవర్గం ఎన్నిక


దివ్యాంగుల సమాఖ్య భీమవరం కార్యవర్గం

భీమవరం: దివ్యాంగులంతా కలిసి ప్రగతి సాధించాలని, ఒకరికొకరు సహకరించుకొని ముందుకు సాగాలని ఏపీ పీహెచ్‌సీ జేఏసీ గౌరవాధ్యక్షుడు దిడ్ల సురేష్ సూచించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీహాల్లో నిర్వహించిన భీమవరం దివ్యాంగుల సమైక్య నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా కోరాడ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొండ్రు అప్పారావు, మహిళా అధ్యక్షురాలిగా దాయం మరియమ్మ, ప్రధాన సలహాదారునిగా మద్దాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా నిమ్మల సింహాచలం, మీడియా కన్వీనర్‌గా పోతుల బాలు ఎన్నికయ్యారు. ఛీఫ్ లీగల్ అడ్వైజర్ యాళ్ల హనోక్‌వర్థన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో లవరాజు, దుర్గా భవాని, రామారావు, చిన్నారి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర శాలివాహన సంఘం ఆత్మీయ సమావేశం


తణుకులో మాట్లాడుతున్న కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం

తణుకు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలోని కుమ్మర శాలివాహనులు సుమారు రూ. 1680 కోట్లకుపైగా వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందారని కుమ్మర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం అన్నారు. బుధవారం తణుకులోని బీసీ సంఘ భవనంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పురుషోత్తం పాల్గొని మాట్లాడారు. జిల్లా శాలివాహన వెల్ఫేర్ కమిటీ సభ్యులు బిరుదుకోట చింతన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఐ.నాగేంద్ర, వెల్ల వెంకటేశ్వరరావు, కోనాల మల్లిఖార్జునరావు, లాంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


పాలకోడేరు: కల్యాణోత్సవ పూజల్లో పాల్గొన్న బంగారు శ్రీ రంగనాథ గుప్త సత్యవతి దంపతులు, భక్తులు


ఉండి: శ్రీరామక్షేత్రంలో సీతారాములను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: శ్రీరామ నవమి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు రామాలయాల్లో సీతారాములోరి కల్యాణోత్సవం కనుల విందుగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక మాదివాడలోని కోదండ రామాలయంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాల్ని భీమవరం అసెంబ్లీ పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు సమర్పించారు. ఎస్ టర్నింగ్ వద్ద, సంతపేటలో, వెలంపేట వద్ద, సిద్ధాపురంలోని కోదండ రామాలయం వద్ద కల్యాణోత్సవాలు కనుల విందుగా నిర్వహించారు. కంచి నుంచి తీసుకువచ్చిన ముత్యాల తలంబ్రాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక స్టేషన్ రోడ్డులోని రామాలయం వద్ద నేవాల వెంకన్న మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. పలు రామాలయాల వద్ద కల్యాణం అనంతరం రాములోరి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరించారు.

వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు

పాలకోడేరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పానకం, వడపప్పు, చలిమిడి, ప్రసాదాలు భక్తులకు పంచారు. పాలకోడేరులోని కోదండ రామాలయంలో సోము ప్రసాద్ ఆధ్వర్యంలో బంగారు శ్రీరంగనాథ గుప్త సత్య దంపతులు, శృంగవృక్షం శివాలయం వద్ద కారుమూరి కృష్ణ కిరణ్మయి దంపతులు, వడ్డీల వీధిలో రాజా గిరిధర్, శైలజ దంపతులు సీతా రాముల కల్యాణోత్సం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

హామీలన్నీ అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంటే శ్రీరాముని మాదిరి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంత కష్టమైనా దానిని నెరవేర్చే గొప్ప నాయకుడు అని ఉండి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉండి శ్రీరామక్షేత్రంలో సీతారాములను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు, చేసిన వాగ్దానానికి విలువ ఇస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని తెలిపారు. విశ్వసనీయమైన రాజకీయం చేసి, ప్రజల నమ్మకాన్ని పొందిన జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైభవంగా వేడుకలు

మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణులను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు కుటుంబ సమేతంగా ఆలయాలకు తరలివచ్చి సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల వద్ద బెల్లం పానకాన్ని నిర్వాహకులు భక్తులకు పంపిణీ చేసారు. ఉండి, ఎన్నార్పీ అగ్రహారం, వెలివర్రు, కోలమూరు, ఉప్పులూరు, మహదేవపట్నం, వాండ్రం, పెదపుల్లేరు, చినపుల్లేరు, చెరుకువాడలోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

భీమవరం (ప్రకాశంచౌక్): శివరావుపేట (రాజులపేట)లో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామివారి 27వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని శుక్లపక్ష చైత్ర శుద్ధ నవమి ఉదయం 12.27 గంటలకు కొప్పెర్ల ఆనంద జగపతిరాజు, తేజస్వీ దంపతులు వేద మంత్రాలతో వైభవంగా నిర్వహించారు. 26 ఏళ్లుగా ఈ ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 18న గ్రామోత్సవం, 19న పవళింపు సేవ, 21న అన్న సమారాధన ఉంటుందని పేర్కొన్నారు. కొప్పెర్ల కృష్ణంరాజు, శ్యామలారాణి, కంతేటి వెంకటరాజు, విష్ణుప్రియ సుబ్బరాజు, కృష్ణవేణి రామరాజు, యు.ధనపతి వర్మ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవాల్లో శాసన మండలి చైర్మన్

రైతు బజార్ రోడ్, నాచువారి సెంటర్, రామాయణం సుబ్బన్న గారి తోట, గునుపూడి స్తూపం సెంటర్ ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు పాల్గొన్నారు. శ్రీరాముని ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు శ్రీ రామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రైల్వే రామాలయంలో శ్రీరామ కల్యాణంలో సీతారాములకు ఆలయ మర్యాదలతో సమర్పించారు.

గొల్లవానితిప్పలో వైభవంగా శ్రీరామ నవమి

భీమవరం అర్బన్: భీమవరం మండలం గొల్లవానితిప్పలో కొలువైయున్న శ్రీ సీతా సమేత కోదండ రామునికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సాయినాథ చార్యులు స్వామివార్లకు పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, గో క్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పుష్పాలతో అలంకరించారు. గుద్దటి బాలాజీ - స్వప్న కుమారి దంపతులు స్వామివార్లకు కలశ పూజ, గౌరీ, విఘ్నేశ్వర, పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. సీతా రాముని కల్యాణ వైభవాన్ని భక్తులు తిలకించారు. స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

మండలంలో..

దొంగపిండి, కొత్తపూసలమర్రు, తోకతిప్ప, రాయలం, చినఅమిరం, పెదగరువు, తుందుర్రు, వెంప, గూట్లపాడు, అనాకోడేరు, కొమరాడ, తాడేరు, బేతపూడి తదితర గ్రామాల శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద పానకం పంపిణీ చేశారు.

మద్ది క్షేత్రంలో వైభవంగా రామయ్య కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బుధవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు రామయ్య కల్యాణాన్ని వీక్షించి తరించారు. పాలకోడేరు గ్రామానికి చెందిన కునాధరాజు అర్జునరాజు, పార్వతి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేసినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ పాల్గొన్నారు.


భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీరాములవారిని దర్శించుకుంటున్న మోషేన్‌రాజు


నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళాన్ని ఈఓకి అందజేస్తున్న దాత అర్జునరావు


గొల్లవానితిప్పలో కోదండరాముని కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


భీమవరం (ప్రకాశంచౌక్): శివరావుపేటలో సీతారాముల కల్యాణం


ఆకివీడు: సిద్ధాపురం రోడ్డులోని రామాలయం వద్ద అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు


ఆకివీడు: సిద్ధాపురంలో కోదండరాముడి కల్యాణోత్సవం


ఉండి: రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


పెన్నాడలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ నాగార్జున

పాలకోడేరు: ప్రతి అంశంలో తన సొంత ప్రయోజనాలు చూసుకునే ఈ రోజుల్లో ప్రధాన రహదారిపై ప్రయాణించే ప్రజలకు మజ్జిగతో దాహం తీర్చడం అభినందనీయమని పాలకోడేరు తహసీల్దార్ కె నాగార్జున అన్నారు. పెన్నాడలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని తహసీల్దార్ నాగార్జున ప్రారంభించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్వీ గోపాలన్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ఏటా వేసవిలో దాహాన్ని తీరుస్తున్న సుందరయ్య స్ఫూర్తితో చలివేంద్రం నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆదాడ లక్ష్మీ తులసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రీయ, గ్రామ పెద్దలు నడిపల్లి సత్యనారాయణ, ఎ.కృష్ణ, ఎ శ్రీనివాసరావు, కలిదిండి గోపాలరాజు, శేషపు నాగలక్ష్మి, దొంతర రాధ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


పెట్రోల్ బంకు వద్ద ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారి రామారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్ని ప్రమాదాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు పలు సూచనలు చేశారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా నాలుగో రోజు బుధవారం పట్టణంలోని కేఎన్ రోడ్డులోని పెట్రోల్ బంకులు వద్ద అగ్నిప్రమాదాలు, జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు సూచనలు అందజేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు మంట లను ఏ విధంగా ఆర్పాలో?పలు సూచనలు, డెమోలు సిబ్బంది ద్వారా చూపించారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యాపార వేత్త నంధ్యాల కృష్ణమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీ కృష్ణదేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పోలీస్ ఐలాండ్ సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వ్యాపారవేత్త, సంఘ గౌరవాధ్యక్షుడు నంధ్యాల కృష్ణమూర్తి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారని నిర్వాహకులను అభినందించారు. సంఘం అధ్యక్షుడు జంగా శ్రీనివాస రామరాయ్, ప్రధాన కార్యదర్శి వెజ్జు రామకృష్ణ, కోశాధికారి వట్టిపులుసు దాన వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఆకివీడు: దుంపగడప గ్రామానికి చెందిన మహిళ మతిస్థిమితం లేక చెరువులో దూకి మంగళవారం మృతి చెందిన ఎస్సై నాగబాబు బుధవారం చెప్పారు. ఆమెను రక్షించడానికి స్థానికులు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై ఆమె సోదరుడు సాంబ్రాణి సామేలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపే లక్ష్యం


కార్యక్రమంలో మాట్లాడుతున్న బాబు

భీమవరం: ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే భావవ్యక్తీకరణ, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపర్చుకోడానికి ఇన్ఫినిటో అనే సాంకేతిక, సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తున్నట్టు భీమవరం డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) తెలిపారు. కళాశాలలో బుధవారం బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ అధర్వర్యంలో ఫస్ట్ ఇయర్ బీటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన ఇన్ఫినిటో ఫెస్ట్ ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. డీఎన్నార్ కళాశాల విద్యార్థులతో పాటు వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఫెస్ట్ ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, ప్రిన్సిపాల్ ఎం అంజన్‌కుమార్, జీజీ రత్నం, బీవీఎస్ వర్మ, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆత్మ గౌరవమే విముక్తికి పునాది


సభలో మాట్లాడుతున్న పేరూరి మురళీ కుమార్

తణుకు టౌన్: స్వీయ గౌరవమే పీడిత ప్రజల విముక్తికి పునాది అని చాటిచెప్పిన మహనీయుడు కేజీ సత్యమూర్తి అని బహుజన రచయితల వేదిక వ్యవస్థాపక కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నూకతోటి రవికుమార్ చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకులోని లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాలులో సామాజిక న్యాయ పోరాట సమితి, బహుజన రచయితల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కేజీ సత్యమూర్తి (శివసాగర్) 12వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సామాజిక న్యాయ పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లి అంబేద్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రవి కుమార్ మాట్లాడుతూ సత్యమూర్తి విప్లవ బావజాలంతో పాటు సాహిత్యాన్ని కూడా అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ సామాజిక విప్లవ పోరాటాలకు శివసాగర్ ఆదర్శనీయుడన్నారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరూరి మురళీకుమార్, రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిపల్లి ఫ్రాన్సిస్, సత్య మూర్తి కంభం సిద్ధార్థ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం తూర్పుపాలెంలో నిర్వహించిన మైనార్టీల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ నేడు ముస్లింలకు సీఎం జగన్ ఎంతో ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అధిక సీట్లు కేటాయించి వారికి సమప్రాధాన్యత కల్పించారన్నారు. చంద్రబాబు మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందన్నారు. చంద్రబాబు మోసపూరిత మాటలకు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్‌రాజు, పెనుగొండ ఎంపీపీ పూతీనిడి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పిల్లి నాగన్న, జక్కంశెట్టి చంటి, పలివెల శ్రీను, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీను, డైరక్టరు బొక్కా అరుణ, పార్టీ నాయకులు కేశరపల్లి రమేష్, కలగట సాగర్, పులిదిండి వెంకటేశ్వరరావు, చిన్నం రామిరెడ్డి, వేండ్ర వెంకటేశ్వర్లు, అయ్యప్ప రెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం

ఉండి: సార్వత్రిక ఎన్నికల పర్వ గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఎన్నికల్లో భాగంగా ఆయా పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు 18వ తేదీ గురువారం ఉదయం 11 నుంచి నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా ఉండి తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అందరు అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య పత్రికా ప్రకటన ద్వారా నామినేషన్ ప్రక్రియపై పలు నియమ నిబంధనలు వివరించారు. నామినేషన్ల ప్రక్రియ 18 నుంచి 25వ తేదీ గురువారం వరకు ప్రతిరోజు (సెలవు దినాలు మినహా) ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీచేసే అభ్యర్థి ఫారం- 2 బీలో నామినేషన్ సమర్పించాలన్నారు. నామినేషన్ దాఖలుకు ఎవరు ముందు వస్తే వారి నామినేషన్ స్వీకరిస్తామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీకి చెందిన అభ్యర్థి నామినేషన్ పత్రం మొదటి భాగంలో ఒక ప్రతిపాదకుడు, గుర్తింపు పొందని, నమోదు కాని లేదా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రం రెండవ భాగంలో 10 మంది ప్రతిపాదకులతో దాఖలు చేయాలన్నారు. ప్రతి అభ్యర్థి గరిష్ఠంగా 4 సెట్లు నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. నామినేషన్లు ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3 గంటలలోపు ఫారం ఏ, ఫారం బి ఒరిజినల్ కాపీలు దాఖలు చేయాలన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ అభ్యర్థులు 10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేలు చెల్లించాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి ఇతర నియోజవకర్గానికి చెందినవారైతే అక్కడి రిటర్నింగ్ అధికారి ధ్రువీకరణ తప్పనిసరి అని తెలిపారు. నామినేషన్ దాఖలుకు అభ్యర్థితో కలిపి ఐదుగురు వ్యక్తులు మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి రావాలని సూచించారు. అభ్యర్థి ఫారం 26ను ఖచ్చితంగా సమర్పించాలన్నారు. అఫిడవిట్‌లో ఉండే ప్రతి గడిని విడిచిపెట్టకుండా తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. ఫారం 26ను రూ.10 స్టాంఫ్ పేపర్‌పై పూరించి దాఖలు చేయాలన్నారు. అఫిడవిట్ అసంపూర్తిగా సమర్పిస్తే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందన్నారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాల కోసం కనీసం ఒక్కరోజు ముందుగా బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే వాటి పూర్తి వివరాలు తెలపాలన్నారు. అభ్యర్థి తప్పనిసరిగా ప్రమాణపత్రాన్ని దాఖలు చేయాలని సూచించారు. ఖర్చుల వివరాలను సంబంధిత అధికారి చెప్పిన సమయంలో వచ్చి తెలపాలన్నారు. నామినేషన్లకు గడువు ఈ నెల 25వ తేదీ ముగియగానే 26న పరిశీలన, 29న మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. సంబంధిత అభ్యర్థుల ఎన్నికల గుర్తులను 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటల తరువాత కేటాయిస్తామని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

తాగునీటి చెరువులు నింపేందుకు కృషి


కొత్తపాలెంలో తాగునీటి చెరువును నింపేందుకు ఇంజన్ల ద్వారా నీటిని తోడుతున్న దృశ్యం

మొగల్తూరు: ప్రధాన కాలువల నుంచి నీటి సరఫరా ఆగిపోయేలోపు శివారు ప్రాంతాలకు సాగు నీరందించడంతో పాటు గ్రామాల్లోని తాగునీటి చెరువులను నింపేందుకు స్థానిక పాలక వర్గాలు, అధికారులు, కృషి చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో ఇంజన్లు ఏర్పాటు చేసి శివారు ప్రాంతాలకు సాగు నీరు అందిస్తున్నారు. జిన్నూరు కాలువ శివారు గ్రామమైన కొత్తపాలెంలోని మంచి నీటి చెరువులో నీటి మట్టం తగ్గింది. దీంతో చెరువును నింపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. బుధవారం కొత్తపాలెంలో తాగునీటి చెరువుకు నీరందించే జిన్నూరు కాలువలో నాలుగు ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు. సర్పంచ్ లోకం నాగలక్ష్మి (నాని) ఆధ్వర్యంలో జిన్నూరు కాలువలో ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువును పూర్తిస్థాయిలో నింపేందుకు సిబ్బంది చర్యలు తీసుకున్నారు. రాబోయే రోజుల్లో గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో పంచాయతీ సిబ్బంది ఇంజన్లు ఏర్పాటు చేసి నీటిని తోడుతున్నారు.